క్లుప్తంగా


మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారాంకు పరామర్శ



సీతారాం ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: అనారోగ్యంతో బాధపడి కోలుకున్న మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారాంను శనివారం మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పరామర్శించారు. సింహాచలంలోని పాత గోశాల వద్ద ఉన్న సీతారాం స్వగృహానికి ముత్తంశెట్టి వెళ్లి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనకు ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ 98వ వార్డు నాయకుడు కర్రి సత్తిబాబు, ఆనందపురం సర్పంచ్ చందక లక్ష్మి, అడవివరం కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి .. సింహగిరి వర్తక సంఘం అధ్యక్షుడు ముగ్గు కిరణ్ తదితరులు ముత్తంశెట్టి వెంట ఉన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం నివేదించారు. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాదం, మజ్జిగ వితరణ చేపట్టారు.

అప్పన్న చందనం సమర్పణకు రూ.లక్ష విరాళం



ఈవోకు చెక్కు అందజేస్తున్న శ్రీనుబాబు

సింహాచలం: వచ్చేనెల 10న వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవాన్ని పురస్కరించుకుని స్వామికి సమర్పించే చందనం కొనుగోలు నిమిత్తం దేవస్థానం మాజీ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు శనివారం రూ.లక్ష విరాళం ఇచ్చారు. సింహగిరికి కుటుంబ సమేతంగా వచ్చిన శ్రీనుబాబు సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తికి అందజేశారు. స్వామికి చందనం సమర్పణ నిమిత్తం ఏటా తొలి విరాళం అందిస్తున్నట్టు శ్రీనుబాబు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హరినామ సంకీర్తన



భజన చేస్తున్న భజన మండలి సభ్యులు, గ్రామస్తులు

పెందుర్తి: మండలంలోని కోట్నివానిపాలెం సీతారామాలయ మాసోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సీతారాములకు అర్చనలు చేశారు. సాయంత్రం గోపాలపట్నంకి చెందిన ఉమా నీలకంఠేశ్వరస్వామి భజన మండలి ఆధ్వర్యంలో హరినామ సంకీర్తన జరిగింది. అనంతరం ప్రసాద వితరణ చేపట్టారు. రామాలయం కమిటీ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

పరవాడ: మండలంలోని భరణికం గ్రామంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న బోండా అప్పలరాజును శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి ఏఎస్ఐ బీవై నాయుడు రూ.2,550 విలువ చేసే 4 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు

వాళ్లది ధన బలం.. మాది జన బలం

- వైఎస్సార్‌సీపీ ప్రజలకు మేలు చేసింది
- జిల్లావ్యాప్తంగా మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలి
- వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు
- ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం

పెందుర్తి: రాష్ట్రంలో పేదలకు– పెత్తందార్లకు మధ్య జరుగుతున్న యుద్ధంలో ధన బలంతో విర్రవీగుతున్న కూటమిని తరిమికొట్టాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. కూటమి తరపున పోటీ చేస్తున్న స్థానికేతరులు ప్రజలకు అందుబాటులో ఉంటారా అని ప్రశ్నించారు. పెందుర్తి కూడలి సమీపంలోని ఓ కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ పెందుర్తి గ్రామీణ, పట్టణ ప్రాంత నాయకులు, ముఖ్య కార్యకర్తలతో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల్లో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమిది ధన బలమని..వైఎస్సార్‌సీపీది ప్రజాబలమని అన్నారు. కూటమి అనకాపల్లి ఎంపీ, పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థులుగా కనీసం స్థానిక పరిస్థితులపై అవగాహన లేని వ్యక్తులు పోటీ చేస్తున్నారన్నారు. కేవలం డబ్బుతో ఎన్నికల్లో నెగ్గుకురాగలమన్న భ్రమలో వారు ఉన్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలు, ప్రజలే బలమని ఉద్ఘాటించారు. వైఎస్సార్‌సీపీలో ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈ నెల 12 నుంచి ప్రతి నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలోకి వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన మంచిని వివరించాలని సూచించారు. ఎంపీగా పోటీ చేస్తున్న తాను, ఎమ్మెల్యేగా పోటీలో ఉన్న అదీప్‌రాజ్ ప్రతీ కుటుంబానికి ఆత్మీయులం అని గుర్తు చేశారు. అధికార దాహంతో కూటమి అభ్యర్థులు చేస్తున్న ప్రచారానికి, ప్రలోభాలకు లొంగవద్దని కోరారు.

ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ వార్డు మెంబర్ స్థాయి నుంచి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన బూడి ముత్యాలనాయుడు తనకు ఎల్లప్పుడూ ఆదర్శప్రాయంగా ఉంటారన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి స్థానికేతురులను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. పెందుర్తి వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు మాట్లాడుతూ పెందుర్తి ప్రాంత వాసులకు బూడి ముత్యాలనాయుడుకు, ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు ఓటు వేసే అవకాశం దక్కడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో అప్పన్న ఉత్సవమూర్తులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందంజస్వామిని గరుడవాహనంపై అధిష్టంపజేసి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. స్వామికి హారతులు అందజేశారు.

అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్



ఆలయ ప్రాంగణంలో అదీప్‌రాజ్‌ను సత్కరిస్తున్న కమిటీ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు గెంజిపేటలోని అంగల పరమేశ్వరి అమ్మవారిని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సాదరంగా ఆహ్వానించి, దర్శనాల అనంతరం సత్కరించింది. కార్యక్రమంలో నాయకులు సుందరపు అప్పారావు, బొద్దపు శ్రీను, గెంజి నాగేశ్వరరావు, సురేష్ , ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

1150వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు

కూర్మన్నపాలెం: కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలనే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని తెర మీదకు తెచ్చారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలను ఐక్య పోరాటాలతో ఎదుర్కొంటామని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో శనివారం, 1150వ రోజు సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాటాడుతూఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన తీరును మార్చుకుని స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

రూ.73,510 సీజ్

సబ్బవరం: మండలంలోని అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై బాటజంగాలపాలెం టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద శనివారం ఒక వ్యక్తి నుంచి రూ.73,510 నగదు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు.పెందుర్తి నుంచి అనకాపల్లి వైపు ఐస్‌క్రీమ్ తరలిస్తున్న వాహనాన్ని ఎస్ఎస్‌టీ టీమ్ సిబ్బంది తనిఖీ చేయగా నగదు పట్టబడినట్లు తెలిపారు. పట్టుబడిన వ్యక్తి ఐస్‌క్రీమ్ డిస్టిబ్యూటర్ అని చెప్పినా నగదుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు చూపించకపోవడంతో సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నాడు కళా విహీనం.. నేడు సుందరవనం

- ఆధునిక హంగులతో సత్యానగర్ పార్కు
- రూ.2 కోట్లతో సకల సౌకర్యాలు
- రూ.5 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు



నాడు: అధ్వానంగా సత్యానగర్ పార్కు



నేడు: రూ.2 కోట్ల నిధులతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సత్యానగర్ పార్కు

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డులోని సత్యానగర్ పార్కు గత ప్రభుత్వం హయాంలో పిచ్చి మొక్కలు..డొంకలతో నిండిన ఓ ఖాళీ స్థలం.. పేరుకు పార్కు అయినా పూర్తిగా కళావిహీనం..కానీ నేడు ఆ పార్కు ఓ సుందరవనం..ఆరోగ్యానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది.

టీడీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన ఈ పార్కును వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తిగా ప్రక్షాళన చేసి అభివృద్ధి పథంలో నిలిపింది. కేవలం కాలనీలోని పార్కు అని చిన్నచూపు చూడకుండా ఏకంగా రూ.2 కోట్లు నిధులు విడుదల చేసి ఆధునిక హంగులతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దింది. దీంతో పాటు మరో రూ.5 లక్షలతో పార్కులో జిమ్ పరికరాలు ఏర్పాటు చేసి కాలనీ వాసులకు అందుబాటులో ఉంచింది.

శరవేగంగా..

ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం ఆ దిశగా జీవీఎంసీ విలీన కాలనీల్లో పార్కులను అభివృద్ధి చేసింది. వీటిల్లో వ్యాయామానికి వీలుగా ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రజల ఆసక్తి, అవసరాన్ని గుర్తించి కాలనీల్లో పార్కులను జీవీఎంసీ అధికారులు ఎంపిక చేసుకుంటున్నారు. ఈ క్రమంలో సత్యానగర్ పార్కును ఎంపిక చేసి అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. కాలనీ వాసులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారు. వాకింగ్ ట్రాక్‌తో పాటు వ్యాయామ పరికరాలు అందుబాటులో ఉంచారు. పిల్లలు ఆడుకోవడానికి జారుడు బల్లలు, ఊయలు ఏర్పాటు చేశారు.దీంతో చిన్నా పెద్దా అన్న తేడా లేకుండా అంతా పార్కు బాట పడుతున్నారు. ఉత్సాహంగా గడుపుతున్నారు. పార్కులో సౌకర్యాలు చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ చొరవ అభినందనీయం



మా ప్రాంతంలో పార్కును 2022లో రూ.2 కోట్ల ప్రభుత్వ నిధులతో సుందరంగా అభివృద్ధి చేశారు. మరికొన్ని నిధులు అదనంగా విడుదల చేసి ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో కాలనీ వాసులంతా వ్యాయామంపై దృష్టి సారిస్తున్నారు. కాసేపు పార్కులో సేదతీరిన తర్వాత జిమ్ చేస్తున్నారు. ఓపెన్ జిమ్‌ల ఏర్పాటులో ప్రభుత్వం చొరవ అభినందనీయం.

– ఎస్.వేణుగోపాల్, సత్యానగర్ కార్యదర్శి.

ప్రజారోగ్యానికి పెద్దపీట



ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం చాలా కీలకమైన నిర్ణయాలు తీసుకుంది. గతంలో పార్కుల్లో కనీస సౌకర్యాలు కూడా ఉండేవి కాదు. ఒకవేళ ఎక్కడైనా అభివృద్ధి చేసినా అది వాకింగ్ ట్రాక్ వరకు మాత్రమే పరిమితం. కానీ ప్రస్తుత ప్రభుత్వం పార్కులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తోంది. దాదాపు ప్రతి పార్కులో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటవుతున్నాయి. సత్యానగర్ పార్కుకు ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. – మెంటి మహేష్, చినముషిడివాడ

మైనారిటీలకు అండగా ఉంటాం

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అదీప్‌రాజ్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: రంజాన్ మాసం సందర్భంగా పెందుర్తి, చిన ముషిడివాడ, సరిపల్లి మసీదుల ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందు స్వీకరించారు. మైనారిటీలకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అదీప్‌రాజ్ వెల్లడించారు. విందులో ముస్లిం సంఘం ప్రతినిధులు షేక్ ఇస్మాయిల్, షేక్ ఖాన్ సాహెబ్, బాబ్జి, షఫీ, షేక్ అబ్దుల్లా మాస్టర్, పీర్ సాహెబ్,షేక్ సైదులు, రెహమాన్, సయ్యద్, ఫాతిమా బీబి, సలీమా, ఖాన్ బేబి, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తాం



సుఖవాసి సతీష్, ఉగ్గిన గోవింద్‌లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: పార్టీకోసం పని చేసే నాయకులతో పాటు ప్రతికార్యకర్తకు సముచితస్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని గుర్రంపాలెంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత సుఖవాసి సతీష్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ పెందుర్తి నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో మరోసారి పెందుర్తిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురబోతుందన్నారు. సతీష్, సర్పంచ్ ఉగ్గిన గోవింద్‌లను సత్కరించారు. సమావేశంలో పార్టీ నేతలు బయిలపూడి భగవాన్ జయరామ్, ఉప్పిలి కనకరాజు, కోడిగుడ్ల దేవిసాంబ, గొర్లె రామునాయుడు, గొరపల్లి శ్రీను, బొడ్డు ప్రకాష్, బి.ఎన్ రాజు, జిన్నాల జయరాజ్, సియాద్రి బాలచంద్ర, గొరపల్లి సాంబ, సారిపల్లి గణేష్, భాస్కర్, రాంబాబు, శివ, జగన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అందరికీ సంక్షేమం



అడవివరంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సింహాచలం: అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు అన్నారు. వార్డు పరిధి అడవివరంలోని సంతోషిమాతగుడి వీధి, ప్రియాగార్డెన్స్ ప్రాంతాల్లో శనివారం రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని, భీమిలి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రియాగార్డెన్స్ కన్వీనర్ తోమురోతు రాము, లంక సత్తిబాబు, పార్టీ నాయకులు కర్రి అప్పలస్వామి, బోర ప్రసాదరెడ్డి, రచ్చవర్మ, ఎస్.అప్పారావు, శిడగం తాతబాబు, కర్రోతు రాము, లండ వెంకటరమణ, బొట్టా శ్రీను, దమ్ము ఎర్రాజీరావు, గుడ్ల గురునాథరెడ్డి, బోర కృష్ణారెడ్డి, అక్కిరెడ్డి అప్పలరాజు, మజ్జి ధర్మా, మజ్జి భీమ,సిరిపురపు చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాయపుర అగ్రహారం.. ప్రగతి మణిహారం

చురుగ్గా అభివృద్ధి పనులు



రాయపుర అగ్రహారంలో నిర్మిస్తున్న శెట్టిబలిజల సామాజిక భవనం



రాయపుర అగ్రహారంకాలనీలో సాగుతున్న సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం

సబ్బవరం: మండలంలోని బంగారమ్మపాలెం సచివాలయం పరిధిలోని రాయపుర అగ్రహారంలో పలు అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి.గ్రామంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులతో గ్రామ రూపురేఖలు మారాయి. లక్షలాది రూపాయలతో చేపట్టిన సీసీ రోడ్లు,డ్రైన్ నిర్మాణంతో వీధులు కొత్త కళను సంతరించుకున్నాయి. మౌలిక వసతుల కల్పనలో భాగంగా గ్రామంలో సామాజిక భవనాలు,వాటర్ ట్యాంకు నిర్మాణం శరవేగంగా సాగుతున్నాయి.

ప్రగతిలో ఉన్న పనుల వివరాలు

- రాయపుర అగ్రహారం కాలనీలో రూ.5 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులు చేపడుతున్నారు.
- కొత్తూరు కొంపల వద్ద రూ.3 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు జరుగుతున్నాయి.
- పంచాయతీ కార్యాలయం వద్ద రూ.2 లక్షలతో నిర్మించిన సీసీ ప్లాట్ ఫాం పూర్తి కావచ్చింది.
- రాయపుర అగ్రహారం శెట్టిబలిజల కాలనీ సమీపంలో రూ.5 లక్షల మండల పరిషత్ నిధులతో శెట్టిబలిజల సామాజిక భవన నిర్మాణం పనులు ప్రారంభించారు.
- గ్రామంలోని సంపద తయారీ కేంద్రం వద్ద రూ.1.5 లక్షలతో ఫెన్సింగ్ ఏర్పాటు పనులు సాగుతున్నాయి.
- రూ.3 లక్షల మండల పరిషత్ నిధులతో ప్రారంభించిన పాత కొత్తూరు నుంచి యాతపాలెం కనెక్టివిటీ రోడ్డు గ్రావెల్ ఫార్మేషన్ పనులు తుదిదశకు చేరుకున్నాయి.

ఘనంగా బీజేపీ వ్యవస్థాపక దినోత్సవం



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్

పరవాడ: పరవాడలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ 44వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జెండాను జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టాభి ప్రసాద్,జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల అప్పారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ భారత్‌ను విశ్వగురువుగా నిలపడంతో పాటు దేశ ప్రజల అభివృద్ధే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు పిల్లా సతీష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నమో బాబు, బండారు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరంలో..

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలోని బీజేపీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు గొంప నర్సింగరావు ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వనం సత్యనారాయణ భరతమాత, దీన్ దయాళ్ ఉపాధ్యాయ,శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కో కన్వీనర్ రెడ్డి రామునాయుడు, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ వర్మ, ఉపాధ్యక్షులు ఆకాష్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



లక్ష్మీరాజ్ (ఫైల్)

సబ్బవరం: మండలంలోని అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై సున్నంబట్టీలు వద్ద ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. జిల్లాలోని యలమంచలికి చెందిన తేటకలి లక్ష్మీరాజ్(48) విశాఖలోని ఓ ప్రైవేటు కంపెనీలో సేల్స్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. పురుషోత్తపురంలో భార్య,పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. సొంత పనులపై స్వగ్రామం యలమంచిలి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై పురుషోత్తపురం శుక్రవారం రాత్రి వస్తున్నాడు. సున్నంబట్టీలు వద్దకు వచ్చేసరికి అదే మార్గంలో వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతి సంతోషి కుమారి శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ పిన్నింటి రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.